www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 27 మార్చి 2023

28న పిల్లలకు ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పిల్లల గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య శిబిరాన్ని ఈ నెల 28వ తేదీ మంగళవారం సాయంత్రం మెంటేవారితోటలోని అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో నిర్వహిస్తున్నట్లు కేంద్రం కన్వీనర్ వి.రాధాకృష్ణ, వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె.విక్రమ్ పిల్లలకు అవసరమైన పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. 15 సంవత్సరాల్లోపు వయస్సు గల చిన్నారులకు మెడికల్ క్యాంపులో ఉచిత పరీక్షలు, చికిత్సకు వైద్య సహాయం అందిస్తారని తెలిపారు. వైద్య శిబిరాన్ని భీమవరం, భీమవరం పరిసర ప్రాంతాల వారు వినియోగించుకోవాలని కోరారు.

పంట నష్టం తేల్చండి..!

అకాల వర్షాలకు పొగాకు, మొక్కజొన్న, మామిడి, నిమ్మ, అరటి పంటలకు తీవ్ర నష్టం

ఇప్పటికీ ప్రాథమిక అంచనాలతోనే సరి

దెబ్బతిన్న పంటల లెక్కలపై రైతుల్లో తీవ్ర అసంతృప్తి

నష్టం అంచనా పూర్తి ఎప్పటికో

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అకాల వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈదురుగాలులు, వడగాళ్ల వాన రైతులను అతలాకుతలం చేసింది. పామాయిల్, నిమ్మ చెట్లు వేళ్లతో సహా కూలిపోయిన పరిస్థితి నెలకొంది. పొగాకు, మొక్కజొన్న, మామిడి, నిమ్మ, అరటి, కూరగాయల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టిన రైతులు లబోదిబోమంటున్నారు. దెబ్బతిన్న పంటలకు సంబంధించి అధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించారు. ఎన్యుమరేషన్ పూర్తి చేసి రైతులకు త్వరితగతిన పరిహారం అందించాల్సి ఉన్నప్పటికీ మందకొడిగా సాగుతుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. అధికారులు చెబుతున్న ప్రాథమిక అంచనాలపై రైతులు తీవ్ర అంసతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సాగు చేసిన పంటలో 33 శాతం దెబ్బతింటేనే నష్టం జాబితాలో చేరుస్తామంటున్నారని, దీంతో తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారనుందని రైతులు చెప్పుకొస్తున్నారు. అధికారుల లెక్కల ప్రకారం నిమ్మ, పామాయిల్, అరటి వంటి ఉద్యాన పంటలు జిల్లాలో 320 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేశారు. సాధారణ పంటలకు వచ్చేసరికి పొగాకు, మినుము, వరి, వేరుశెనగ, మిర్చి వంటి పంటలు 955 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు చెప్పుకొస్తున్నారు. అకాల వర్షాలకు పెద్దఎత్తున దెబ్బతిన్న పంటల్లో పొగాకు అత్యధికంగా ఉంది. అధికారుల లెక్కల ప్రకారం 497 ఎకరాల్లో పొగాకు దెబ్బతిన్నట్లుగా చెబుతుండగా ఒక్క జీలుగుమిల్లి మండలంలోనే పొగాకు పంట నష్టం పెద్దఎత్తున ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. ఈ మండలంలో వడగళ్ల వానకు ఒక్క గ్రామంలోనే 150 ఎకరాలకుపైగా పొగాకు పంట దెబ్బతిన్నట్లు రైతులు చెబుతున్నారు. మెట్ట ప్రాంతంలో పొగాకు పంట వేలాది ఎకరాల్లో సాగైంది. పంటనష్టం పెద్దఎత్తున జరిగినట్లు రైతులు చెబుతున్నా అధికారుల లెక్కలు మాత్రం నామమాత్రంగా ఉన్నాయి. 33 శాతం నిబంధన పేరిట దెబ్బతిన్న పొలాలను సైతం లెక్కల నుంచి పక్కన పెడుతున్నట్లు తెలుస్తోంది. నిమ్మచెట్లు ఈదురుగాలులకు వేళ్లతో సహాలేచి కుప్పకూలాయి. పెద్దఎత్తున కూలిన తోటలనే లెక్కల్లోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. పంటనష్టం అంచనాలకు సంబంధించి పూర్తిస్థాయిలో జరగాల్సి ఉంది. పంట నష్టం నమోదు ప్రక్రియ ప్రారంభించినట్లు చెబుతున్నా చురుగ్గా సాగుతున్న దాఖలాల్లేవు. పంటనష్టం అంచనాలపై నిబంధనలు సడలించి రైతులకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు. మొక్కజొన్న రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉందని అంతా లబోదిబోమంటున్నారు. పంట నష్టం అంచనాలన్నీ గోల్‌మాల్‌గా ఉన్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంటనష్టం ప్రాథమిక అంచనాలపై వ్యవసాయాధికారులు కనీసంగా ప్రకటన చేయని పరిస్థితి నెలకొంది. పంటనష్టంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే చర్చ రైతుల్లో సాగుతోంది. దెబ్బతిన్న పంటను లెక్కించి పరిహారం త్వరితగతిన అందించేలా చూడాలని రైతులు కోరుతున్నారు. పంటనష్టానికి ఇచ్చే పరిహారంపైనా రైతుల్లో తీవ్ర చర్చ సాగుతోంది. పెట్టుబడులు భారీగా పెరిగిన నేపథ్యంలో పంట నష్టపరిహారం సైతం పెంచాలని రైతులు కోరుతున్నారు.

మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ

కొనసాగిన చలో ఢిల్లీ ప్రచార యాత్ర

ప్రజాశక్తి - భీమవరం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న కార్మిక, రైతుసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ప్రచారయాత్ర ఆదివారం భీమవరం చేరుకుంది. ప్రకాశంచౌక్, ఇతర ప్రాంతాల్లో జరిగిన సభల్లో సిఐటియు జిల్లా నాయకులు బి.వాసుదేవరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కౌలురైతు సంఘం జిల్లా నాయకులు మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడారు. కార్మిక చట్టాలను తుంగలో తొక్కి రైతులను భూములకు దూరం చేసే చట్టాలను తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం చూస్తుందన్నారు. సాధారణ ప్రజలపై భారాలు మోపుతూ గత ఎనిమిది సంవత్సరాలుగా కేంద్ర బిజెపి ప్రభుత్వం కక్షపూరిత పాలన సాగిస్తుందని మండిపడ్డారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదాను ఎగ్గొట్టి పోలవరానికి నిధులివ్వకుండా ఇబ్బందులు పెడుతుందన్నారు. చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు ఎం.ఆంజనేయులు, డి.నాగు, ఎన్.రాజు, షేక్ వలీ, పోతు శ్రీను పాల్గొన్నారు.

ఉండి: చలో ఢిల్లీని విజయవంతం చేయాలని చేపట్టిన ప్రచార జాతా ఆదివారం ఉండి మెయిన్ సెంటర్‌కు చేరుకుంది. ఈ ప్రచార జాతకు ప్రజాసంఘాల నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం జాతా నేతలు మాట్లాడారు. కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్, కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు, పోతు శ్రీను, స్థానిక నేతలు ధనికొండ శ్రీనివాస్, కాటా నరేష్, దేవల శివ గణేష్, కొట్టాడ వెంకటేశ్వరరావు, మోపిదేవి రాము పాల్గొన్నారు.

కాళ్ల: చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదంచేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. జీపు యాత్ర జువ్వలపాలెం, కాళ్లకూరు, కాళ్ల, సీసలి, పెదఅమిరం గ్రామాల మీదుగా సాగింది. కాళ్లలో బస్టాండ్ సెంటర్లో నిర్వహించిన సభలో నేతలు మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు ఆకుల హరేరామ్, మామిడిశెట్టి రామాంజనేయులు, మండా సూరిబాబు, తిరుమాని శ్రీను, వెంకటేశ్వరరావు, కొండరాజు పాల్గొన్నారు.

ఆకివీడు: చలో ఢిల్లీ ప్రచార యాత్ర ఆదివారం ఆకివీడు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో నాయుడు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడారు. మాట్లాడారు. కార్యక్రమంలో జాతా నేతలతోపాటు స్థానిక నాయకులు నెల్లి సూరిబాబు, రంగా, గౌరినాయుడు, రామకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

మొగల్తూరు : చలో ఢిల్లీ ప్రచార యాత్ర ఆదివారం సాయంత్రం మొగల్తూరు చేరుకుంది. ఈ సందర్భంగా గాంధీబొమ్మల సెంటర్‌లో జాతా నేతలు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ, ఎం.ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు యడ్ల చిట్టిబాబు, ఆదూరి సాంబమూర్తి, కొత్తపల్లి నాగరాజు, వీర పాండురంగారావు పాల్గొన్నారు.

ప్రతిభాపాటవ పోటీల నిర్వహణ అభినందనీయం

ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ సూర్యతేజ

ప్రతిభా పాటవ పోటీల పరీక్ష పత్రాన్ని విడుదల చేసిన ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ సూర్యతేజ

ప్రజాశక్తి - పాలకొల్లు

విద్యా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో పాలకొల్లు పట్టణం, పాలకొల్లు, పోడూరు, ఆచంట, యలమంచిలి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 7, 9 తరగతుల విద్యార్థులకు ప్రతిభాపాటవ, వ్యాసరచన పోటీలు స్థానిక ఎంఎంకెఎన్ఎం మున్సిపల్ పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. సమాఖ్య కార్యదర్శి పోలిశెట్టి శ్రీశ్రీ అధ్యక్షత వహించారు. గత 10 సంవత్సరాలుగా ఈ ప్రతిభాపాటవ పరీక్షలను నిర్వహిస్తున్నామని, పరిసర మండలాల్లోని పాఠశాలల నుండి 550 మంది ఈ పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. ఈ పరీక్షల విజేతలకు త్వరలో బహుమతి ప్రదానోత్సవ సభ ఏర్పాటు చేసి నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేస్తామని తెలిపారు. జిల్లా ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ సూర్యతేజ పరీక్ష పేపర్లను విడుదల చేశారు. తాను చిన్నప్పటి నుండి కలెక్టర్ కావాలనే చదివానని, ఆ ఆశయంతోనే కష్టపడి విజయం సాధించానని సూర్యతేజ తెలిపారు. విద్యార్థి దశ నుంచే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని కోసం కృషి చేయాలన్నారు. ఇంతమంది విద్యార్థులను ఒకచోటకు చేర్చి పరీక్షలు నిర్వహిస్తున్న విద్యా చైతన సమాఖ్య కృషి అభినందనీయమన్నారు. 40 మంది ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా పాల్గొని సేవలందించడాన్ని జెసి అభినందించారు. కార్యక్రమ నిర్వహణను తోలేటి గాంధీ, జన్మది నాగేశ్వరరావు, మంచెం ఉమామహేశ్వరరావు, మంచెం కనకరాజు, డివివి.ప్రసాద్, చేగొండి కరుణకుమార్, వంగా కరుణకుమార్, కంజరాపు దుర్గాప్రసాద్, కొంతేటి ఫణికుమార్, వర్ణనపు సుదీప్, పాఠశాల హెచ్ఎం అడ్డాల సత్యనారాయణ పర్యవేక్షించారు.

సత్యం ఆర్థోపెడిక్ మెడిసిన్ అండ్ సర్జన్ హాస్పటల్ ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ గ్రంధి

స్థానిక డిఎన్ఆర్ కళాశాల రోడ్డులో సత్యం ఆర్థోపెడిక్ మెడిసిన్ అండ్ సర్జన్ హాస్పటల్‌ను శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎంఎల్ఎలు గ్రంధి శ్రీనివాస్ (భీమవరం), మంతెన రామరాజు (ఉండి) ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయిలో భీమవరంలో వైద్య సేవలను అందిస్తున్నారన్నారు. భీమవరం పరిసర ప్రాంత ప్రజలకు ఈ హాస్పిటల్ ద్వారా మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. హాస్పటల్ నిర్వాహకులు డాక్టర్ వివిజె.సోమరాజు మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలు ఏర్పాటు చేశామని, వీటితో రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు, నేతలు గోకరాజు రామరాజు, వేగిరాజు రామకృష్ణంరాజు, భూపతిరాజు శ్రీనివాసవర్మ, మేడిది జాన్సన్, గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), మెంటే పార్థసారధి, మంతెన రామ్‌కుమార్‌రాజు, ఐఎంఎ అధ్యక్షులు జి.బాలకృష్ణంరాజు, కనుమూరి అబ్బాయిరాజు, యిర్రింకి లక్ష్మీ, గనిరెడ్డి త్రినాథ్ పాల్గొన్నారు.

వైసిపి మహిళా సాధికార ప్రభుత్వం

ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం :తమది మహిళా సాధికారిక ప్రభుత్వమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెం మాగంటి ఫంక్షన్ హాల్లో ఆదివారం పట్టణానికి చెందిన డ్వాక్రా గ్రూపులకు మూడో విడత వైఎస్ఆర్ ఆసరా రుణాలు పంపిణీ చేశారు. పట్టణంలో 1036 స్వయం సహాయక సంఘాలకు చెందిన 9430 మందికి రూ.8 కోట్ల లక్ష 31 వేల 277 రూపాయల చెక్కును ఆయన మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తున్నారన్నారు. 2019 ఏప్రిల్ 11వ తేదీ నాటికి రాష్ట్రంలో ఉన్న డ్వాక్రా రుణాలు మొత్తం 25,571 కోట్లు మాఫీ చేసి ఆ మొత్తాన్ని డ్వాక్రా మహిళలకు నాలుగు వాయిదాలుగా వారివారి ఖాతాల్లో ముఖ్యమంత్రి జమ చేస్తున్నారన్నారు. ఇప్పటివరకూ మూడు వాయిదాల్లో 19178 కోట్ల 17 లక్షల రూపాయల మొత్తాన్ని మహిళల ఖాతాలకు జమ చేశామన్నారు. సభలో మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్, భీమవరం ఆర్‌డిఒ దాసిరాజు, వైసిపి నాయకులు ముప్పిడి సంపత్ కుమార్, కులుకులూరి ధర్మరాజు, టిఎల్ఎఫ్ ప్రెసిడెంట్ రామలక్ష్మి పాల్గొన్నారు.

నరసింహమూర్తి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

ఆదర్శప్రాయులు యల్లమిల్లి

నరసింహమూర్తి ఆశయ సాధనకు కృషి - సంస్మరణ సభలో నేతల పిలుపు

ప్రజాశక్తి - పాలకోడేరు

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాయ్

ఉపాధ్యాయ నేత, కళాకారుడు, వామపక్షవాది యల్లమిల్లి నరసింహమూర్తి ఆదర్శప్రాయులని పలువురు వక్తలు కొనియాడారు. నరసింహమూర్తి ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వేంద్ర గ్రామలో యుటిఎఫ్, కళాకారుల ఆధ్వర్యంలో నరసింహమూర్తి సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి చిత్రపటానికి ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటి రాజు), సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఎన్‌వి.గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్, ప్రముఖులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షత వహించి మాట్లాడారు. నరసింహమూర్తి ఉపాధ్యాయునిగా, ఉపాధ్యాయ నేతగా, వామపక్షవాదిగా, నటుడిగా అనేక సేవలందించారని గుర్తు చేశారు. నరసింహమూర్తి తన కుటుంబాన్ని క్రమశిక్షణతో చక్కగా తీర్చిదిద్దారన్నారు. సమాజానికి తన వంతు సేవలందించారని చెప్పారు. భీమవరంలోని అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ సేవా కేంద్రానికి నరసింహమూర్తి కుటుంబ సభ్యులు రూ.50 వేలు ఆర్థిక సహకారం అందించారని ప్రకటించారు. ముఖ్యఅతిథి ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటి రాజు) మాట్లాడుతూ తన తండ్రి కీర్తిశేషులు సూర్యనారాయణరాజుతో నరసింహమూర్తి సన్నిహితంగా ఉండేవారని గుర్తు చేశారు. తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో వ్యక్తిగతంగా, రాజకీయాల్లో అనేక సలహాలు నరసింహమూర్తి అందించారన్నారు. ప్రముఖ వైద్యులు దంపనబోయిన చలపతిరావు మాట్లాడుతూ నరసింహమూర్తి తనకు పెద్దఅన్నగా గ్రామంలో ఎన్నో సహాయ సహకారాలు అందించారన్నారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శనీయమన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం తుదివరకూ పోరాడారన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా నరసింహమూర్తి ఎంతోమంది బంగారు భవిష్యత్తుకు బాటలు వేశారన్నారు. ఉద్యమాల్లో అంకితభావంతో పని చేసి సమస్యల పరిష్కారానికి పాటుపడ్డారని గుర్తు చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి మాట్లాడుతూ యుటిఎఫ్‌లో నరసింహమూర్తి కీలకపాత్ర పోషించారన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం తపించారని, సమాజంలో రుగ్మతలు తొలగిపోవాలని కాంక్షించారని తెలిపారు. వీరవాసరం మాజీ ఎంపిపి వీరవల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ నరసింహమూర్తి వద్ద తాను ఎన్నో విషయాలు నేర్చుకున్నానని, ఆయన మృతి బాధాకరమని అన్నారు. ప్రముఖ న్యాయవాది మల్లుల శ్రీనివాస్ మాట్లాడుతూ నరసింహమూర్తి గ్రామంలో దినపత్రిక చదివి దానిలో సారాంశాన్ని అందరికీ చెప్పేవారని గుర్తు చేశారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు చింతపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ నరసింహమూర్తి సమాజం కోసం పాటుపడ్డారన్నారు. అన్యాయం సహించే వారు కాదన్నారు. సీనియర్ కళాకారుడు శ్రీశైలం మాట్లాడుతూ నరసింహమూర్తి తనకు ప్రాణ స్నేహితుడని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో ఇద్దరం కలిసి అనేక నాటకాలు వేశామన్నారు. నరసింహమూర్తి నాటకాలకు దర్శకత్వం వహించేవారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కడలి నాగేశ్వరి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు, సిపిఎం మండల కార్యదర్శి అసిరియ్య, సీనియర్ నాయకులు తాడి రామారావు, నరసింహమూర్తి కుటుంబ సభ్యులు భార్య సత్యవతి, కుమారులు అచ్యుత సూర్య సుబ్రమణ్యం, వైఎస్ఎన్.మూర్తి, సత్యనారాయణ, శ్రీనివాసరావు, వెంకటలక్ష్మి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు గొట్టుముక్కల రామలింగరాజు (మాస్టర్), గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు, మాజీ ఎంపిపి పాలా వెంకటచలపతి నరసింహమూర్తి, కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఈ నిర్బంధం ఇంకెన్నాళ్లు..!

ప్రపంచంలోనే అత్యంత బలమైన ప్రజాస్వామ్య వ్యవస్థ గల దేశంగా మన దేశానికి పేరుంది. అయితే అది ఒకప్పటి మాటగా మారిందా అంటే అవుననే సమాధానం వస్తోంది. నేడు అడుగు తీసి అడుగేస్తే నిర్బంధం, సమస్యలపై నినదిస్తే దేశద్రోహం అనే విధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దగ్గర నుంచి రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం వరకూ ఒకే రీతిన వ్యవహరిస్తున్నాయి.

ఇటీవల తమ సమస్యల పరిష్కారానికి అంగన్వాడీలు చలో విజయవాడకు పిలుపునిచ్చారు. ప్రధానంగా సిఎం జగన్ తన పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలనేది వారి ప్రధాన డిమాండ్. నవరత్నాల పేరుతో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వ పెద్దలు జగన్ ఇచ్చిన హామీల గురించి మాత్రం మాట్లాడకపోవడం అందరినీ విస్మయపరుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇప్పటికైనా తమకిచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ అంగన్‌వాడీలు చలో విజయవాడ చేపట్టారు. అయితే వారిపై ప్రభుత్వం పోలీసుల ద్వారా ప్రయోగించిన నిర్బంధం అందరినీ నివ్వెరపోయేలా చేసింది. ఏలూరు సమీపంలో కలపర్రు టోల్‌గేట్ వద్ద పహారా కాసిన పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టి అర్ధరాత్రి సమయం నుంచి అరెస్టులపర్వానికి తెరతీశారు. ఆపై వారిని పెదపాడు, ఏలూరు రూరల్ పోలీసు స్టేషన్లకు తరలించారు. అయితే కనీసం మహిళలని చూడకపోవడం, అర్ధరాత్రి అరెస్టు చేస్తున్నామనే స్పృహ లేకుండా స్టేషన్‌కు తరలించాక కనీసం మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు లేనిచోట నిర్బంధించడం ఈ ప్రభుత్వ తీరును చెప్పకనే చెబుతోంది. తమ డిమాండ్లపై నినదించాలా.. ప్రభుత్వ తీరును నిరసిస్తూ సౌకర్యాల గురించి నినదించాలా అనే డోలాయమాన పరిస్థితిని సృష్టించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి దక్కిందనే చెప్పొచ్చు. గ్రామాల్లో మహిళల హక్కుల పరిరక్షణకు, భద్రత కోసమే నియమించినట్లు చెప్పిన సచివాలయ మహిళా పోలీసులను ఆ మహిళల హక్కులనే హరించేలా అంగన్‌వాడీల నిర్బంధానికి ఉపయోగించిన తీరు సర్వత్రా చర్చనీయాంశమైంది. అయినా మొక్కవోని ధైర్యంతో అంగన్‌వాడీలు ఎక్కడికక్కడ ఆందోళనలు చేపట్టడంతో జిల్లాలోని పోలీసు స్టేషన్లు నినాదాలతో మార్మోగాయి. అదే తరహా నిర్బంధం కొనసాగుతున్న వేళ మరుసటి రోజు ఆశాలు తమ డిమాండ్లు నెరవేర్చాలంటూ రెండు జిల్లాల్లో కలెక్టరేట్, తహశీల్దార్ కార్యాలయాల వద్ద కదంతొక్కారు. పశ్చిమగోదావరి జిల్లాలోని ఆశాలంతా భీమవరంలోని కలెక్టరేట్ వద్దకు చేరుకుని నినదించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారుల తీరు చర్చనీయాంశమైంది. తమ శాఖ పరిధిలోని వందలాది మంది ఆశాలు మండుటెండలో రోడ్డెక్కినా స్పందించకపోవడం ప్రభుత్వ పెద్దల నిర్లక్ష్యాన్నే ఆ శాఖ జిల్లా ఉన్నతాధికారులు ప్రదర్శించారనే వ్యాఖ్యానాలు విన్పించాయి. పోలీసుల జోక్యంతో దిగొచ్చిన అదనపు డిఎంహెచ్ఒ వినతిపత్రం తీసుకుని కొన్ని హామీలైతే ఇచ్చారు. ఇది కచ్చితంగా ఆశాల విజయంగానే చెప్పుకోవాలి. అదే సమయంలో ఆ హామీలు అమలు చేయకపోతే కచ్చితంగా పోరాటం ఉధృతం చేస్తామని నేతలు అక్కడే స్పష్టం చేయడం వారి సమస్యల తీవ్రతను ప్రతిబింబిస్తోంది. మొత్తంగా చూస్తే అటు అంగన్‌వాడీలు, ఇటు ఆశాలు వారి సమస్యలపై గళమెత్తితే వారి సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేయకుండా కనీసం మహిళలనే కనికరం లేకుండా ప్రభుత్వం నిర్బంధానికి పాల్పడటం, అదే తీరులో ఆ నిర్బంధాన్ని వారు ప్రతిఘటించడం భవిష్యత్తు పోరాటాలకు స్ఫూర్తిదాయమనే చెప్పొచ్చు.

ఇక సిఎం జగన్ శనివారం దెందులూరు వచ్చి వైఎస్ఆర్ ఆసరా మూడో విడత నిధులను విడుదల చేశారు. ఆయన నేరుగా హెలీకాప్టర్‌లో దెందులూరు వచ్చి మళ్లీ అక్కడ నుంచి అదే హెలీకాప్టర్‌లో తాడేపల్లి వెళ్లిపోయారు. ఎక్కడ సిఎం జగన్‌ను అడ్డుకునే అవకాశమే లేదు. అయినా సరే ప్రభుత్వ పెద్దలకు అభద్రతా భయమో.. లేక పోలీసు అధికారుల అత్యుత్సాహమోగానీ జిల్లా కేంద్రమైన ఏలూరు నుంచి నూజివీడు తదితర ప్రాంతాల నేతలకు ముందస్తు నోటీసులివ్వడం, ఆపై గృహనిర్బంధాలు చేయడం గమనార్హం. పైగా ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగిన ఎన్నికల్లో గెలిచి బాధ్యతల్లో ఉన్న ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీని సైతం గృహనిర్బంధం చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. పైగా పక్కనే పశ్చిమగోదావరి జిల్లాలోని నేతలకు సైతం ముందస్తు నోటీసులివ్వడం, గృహనిర్బంధాలకు ప్రయత్నించడం గమనార్హం. ఈ గృహనిర్బంధాల ద్వారా ప్రభుత్వం ఏం సాధించిందంటే అపఖ్యాతి మూట్టగట్టుకోవడం తప్ప ప్రత్యేకంగా పొందిన లాభమేమీ లేదు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు, ఇటు ఉన్నతాధికారులు ఆలోచించి ఈ నిర్బంధపు విధానాలను విడనాడకపోతే కచ్చితంగా రానున్న రోజుల్లో ప్రభు త్వానికి నష్టం తప్పదని రాజకీయ పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.

దోబూచులాట

ఎంఎల్ఎ కోటాలో వైసిపి నుంచి ఎంఎల్‌సిగా కైకలూరు ప్రాంతానికి చెందిన జయమంగళ వెంకటరమణ గెలుపొందారు. అయితే గెలుపు ఈయనతో దోబూచులాడిందనే చెప్పొచ్చు. ప్రథమ ప్రాధాన్యతా ఓటుతో టిడిపి అభ్యర్థి పంచుమర్తి అనురాధ గెలిచారనే వార్తతో ఓడిన వైసిపి అభ్యర్థి ఎవరనే చర్చ సర్వత్రా సాగింది. ఇటీవలే టిడిపి నుంచి వైసిపి గూటికి చేరిన జయమంగళ పరాజయం పాలయ్యారనే వార్త చక్కర్లు కొట్టింది. దీంతో వైసిపి శ్రేణులు మరింత నిరాశకు గురవ్వగా టిడిపి శ్రేణులు మరింత కేరింత కొట్టాయి. అయితే కొద్దిసేపటికే రెండో ప్రాధాన్యతా ఓటుతో జయమంగళ గెలిచారనే వార్తతో వైసిపి శ్రేణులు ఊపిరిపీల్చుకున్నాయి. మొత్తంగా ఈసారి ఎంఎల్‌సి ఎన్నికల్లో అటు స్థానిక సంస్థల కోటాలోను, ఇటు ఎంఎల్ఎ కోటాలోనూ సంఖ్యా బలం ఉన్నప్పటికీ జిల్లాలో చావుతప్పి కన్నులొట్టపోయినట్లు బతికి బయట పడినట్లుగా వైసిపికి టిడిపి ముచ్చెమటలు పట్టించిందనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

బాపనయ్య ఉద్యమ కృషి చిరస్మరణీయం

ప్రజాశక్తి - పెనుమంట్ర

సిపిఎం సానుభూతి పరుడు, శాసనమండలి సభ్యుడు బాపనయ్య రాష్ట్రంలో వ్యవసాయ కార్మికోద్యమ నిర్మాణానికి శాయశక్తులా కృషి చేశారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ కొనియాడారు. పొలమూరులో వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో బాపనయ్య 45వ వర్ధంతి సభ ఆదివారం జరిగింది. తొలుత బాపనయ్య చిత్రపటానికి ఘంటే సూర్యారావు, చంద్రం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల కూలి రేట్లు పెరగడం కోసం ఆయన అనేక ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామ కార్యదర్శి ఆశీర్వాదం, చింతపల్లి తిరుమలరావు, పిల్లి రాజారావు, కె.ప్రమోద్ పాల్గొన్నారు.

సిఎంను కలిసిన కిషోర్ కుమార్

ప్రజాశక్తి - ఆచంట

అక్కా చెల్లెమ్మలు ఆనందంగా ఉండడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్ అన్నారు. ఏలూరు జిల్లా దెందులూరులో శనివారం జరిగిన వైఎస్ఆర్ ఆసరా కింద మూడో విడత పంపిణీ కార్యక్రమానికి వచ్చిన ముఖ్యమంత్రిని కిషోర్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి ముఖ్యమంత్రికి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కార్యకర్తలతో కలిసి మరింత కృషి చేయాలని తెలిపినట్లు కిషోర్ కుమార్ విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరిగెల సురేష్‌బాబు, మనవర్తి విజయ్ కుమార్, కుక్కల కిరణ్, దాసరి ప్రసాద్ ఉన్నారు.

తూర్పుకాపుల సమస్య పరిష్కరించాలని..

జగన్‌కు తాతాజీ వినతి

ప్రజాశక్తి - పాలకొల్లు

తూర్పుకాపులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఓబిసి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ సిఎం జగన్‌ను కోరారు. దెందులూరు వచ్చిన సిఎంకు ఆయన వినతిపత్రం సమర్పించారు. 2008లో తూర్పు కాపుల ఇబ్బందులను గ్రహించిన వైఎస్ఆర్ బిసి రిజర్వేషన్ జిఒ ఇచ్చారని, 9 సంవత్సరాల అనంతరం చంద్రబాబు ప్రభుత్వం 2017లో ఆ జిఒ ఎత్తివేశారని చెప్పారు. ఒక్క ఉత్తరాంధ్రలో ఉన్న అవకాశం రాష్ట్రంలో ఉన్న ప్రతి తూర్పు కాపునకూ అందించాలని కోరారు. స్పందించిన సిఎం బిసి కమిషన్‌కు వివరాలు తెలియజేయాలని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు తాతాజీ విలేకరులకు తెలిపారు.



వికలాంగునికి ఎలక్ట్రానిక్ ట్రై సైకిల్ అందిస్తున్న కొవ్వలి ఫౌండేషన్ కార్యదర్శి జయలక్ష్మి

కొవ్వలి ఫౌండేషన్ సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి - మొగల్తూరు

కొవ్వలి ఫౌండేషన్ సేవలు ఆదర్శనీయమని టిడిపి మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు అన్నారు. ఆదివారం రామన్నపాలెంలోని పిట్టవారి పేటకు చెందిన ఊర రవి కుమార్‌కు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.50 వేల విలువైన ఎలక్ట్రానిక్ ట్రై సైకిల్‌ను ఫౌండేషన్ కార్యదర్శి కొండా జయలక్ష్మి అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడారు. కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి రామ్మోహన్ నాయుడు ప్రజలకు మరెన్నో సేవలు చేయాలన్నారు. భవిష్యత్తులో కూడా రామ్మోహన్ నాయుడు మరిన్ని సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆకన సుబ్రహ్మణ్యం, అడ్డాల బాబ్జీ, బళ్ల శ్రీను, బిపిఎస్‌వి సత్యనారాయణ, గుబ్బల జగన్నాథం, చిట్టిబాబు,కట్టా నాగూర్ పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న చిట్టూరి సత్యవసారాణి

ఘనంగా చిట్టూరి సుబ్బారావు జయంతి

ప్రజాశక్తి - తణుకురూరల్

ఎస్‌కెఎస్‌డి విద్యా సంస్థల వ్యవస్థాపకులు చిట్టూరి సుబ్బారావు జయంతి వేడుకలు కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యవసారాణి మాట్లాడుతూ మహిళా సాధికారత, స్త్రీ విద్యే లక్ష్యంగా తన సోదరి కండేవి సరోజినీదేవి పేరిట స్థాపించిన ఈ విద్యా సంస్థ ఆయన కృషి వల్ల అంచెలంచెలుగా ఎదుగుతూ పేరెన్నికగన్న విద్యా సంస్థగా రూపుదిద్దుకొందన్నారు. ఈ సంవత్సరం నుంచి మార్చి 26వ తేదీన కళాశాల వ్యవస్థాపక దినోత్సవంగా నిర్వహించేందుకు నిర్ణయించామన్నారు. ఆయన ఆశయాలను ముందుకు నడిపించడమే విద్యా సంస్థల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కోమట్లపల్లి వెంకటసుబ్బారావు, ట్రెజరర్ నందిగం సుధాకర్, జాయింట్ సెక్రెటరీ చిట్టూరి వెంకటకృష్ణారావు, పాలకవర్గ సభ్యులు రినా సాయి, పురప్రముఖులు పాల్గొన్నారు.

30 నుంచి రామలింగేశ్వరస్వామి కళ్యాణోత్సవాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 30 నుంచి ఏప్రిల్ ఐదో తేదీ వరకూ పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరస్వామి కళ్యాణోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఉత్సవాలకు హాజరు కావాలని రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి కొట్టు సత్యనారాయణకు ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ధర్మకర్తలు అమలాపురపు జ్యోతి బాలాజీ, ఎస్‌విఎస్.మధుసూదన్‌రావు, రెల్లి నరసింహారావు, ఇఒ యాళ్ల సూర్యనారాయణ తాడేపల్లిగూడెంలో ఆదివారం ఆహ్వాన పత్రిక అందించారు.

కోడిపందేల రాయుళ్లు అరెస్టు

గణపవరం:మండలంలో ఎస్.కొండేపాడు గ్రామంలో ఆదివారం కోడిపందేలు నిర్వహిస్తున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు తెలిపారు. వారి వద్ద నుండి 4 కోడి పుంజులు, 5060 రూపాయలు నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పాలకొల్లు రూరల్ : ఉల్లంపర్రులో కోడిపందేల శిబిరంపై ఆదివారం పాలకొల్లు రూరల్ పోలీసులు దాడి చేసి 9 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి కోడి, 9 సెల్ ఫోన్లు, మూడు మోటార్ బైకులు రూ.23,500 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ కె.శ్రీనివాస్ తెలిపారు. అలాగే లంకలకోడేరులో పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులో తీసుకుని వారి వద్ద నుంచి రూ.1600 రూపాయలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బీచ్ వద్ద పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు చేరుకుని సముద్ర స్నానాలు చేశారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే, కొబ్బరి తోటలో భోజనాలు చేసి సేద తీరారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

మెరుగైన ఫలితాల సాధనకు కృషి

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా బోధన

కె.వనజ, సుబ్బారావుపేట మున్సిపల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, తాడేపల్లిగూడెం

పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలనే తపనతో ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ఈ సంవత్సరం పది పరీక్షలకు 113 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రతినెలా తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి వారి సలహాలు సూచనలు తీసుకుంటున్నాం. పిల్లలు ఇంటి వద్ద ప్రణాళికా బద్ధంగా చదివేలా సూచిస్తున్నాం. నూరుశాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేస్తున్నాం.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

ఎఎస్ఆర్.మూర్తి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తాడేపల్లిగూడెం

మా పాఠశాల నుంచి 186 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. వారిలో 150 మంది ఇంగ్లీషు మీడియం, 36 మంది తెలుగు మీడియం విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులను గ్రేడ్ల వారీగా విభజించాం. సి, డి గ్రేడు విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక అదనపు తరగతులు నిర్వహిస్తున్నాం. దాతల సహకారంతో విద్యార్థులకు ప్రతిరోజూ సాయింత్రం అల్పాహారం అందిస్తున్నాం. నూరు శాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేస్తున్నాం.

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం..

సిహెచ్.రవికుమార్, రవితేజ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్, పెంటపాడు

తమ స్కూల్ నుంచి పదో తరగతి పరీక్షలకు 15 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఆయా విద్యార్థులను ఐదుగురు ఉపాధ్యాయులు దత్తత తీసుకుని నూరుశాతం ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రతి నెలా పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఈ పరిసర ప్రాంతాల్లో ఇంగ్లీష్ మీడియం స్కూల్స్ తక్కువగా ఉన్నాయి. అందువల్ల తమ స్కూల్‌కు విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రత్యేక పట్ల శ్రద్ధ తీసుకోవాలి. పరీక్షలు అయ్యే వరకూ సెల్ ఫోన్లు ఇవ్వకూడదు. పోషకాలతో కూడిన ఆహారం అందించాలి. నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం.

జగన్‌ది అరాచక పాలన

మాజీ మంత్రి కొల్లు రవీంద్ర విమర్శ

ప్రజాశక్తి - పాలకోడేరు

కరోనా కన్నా భయంకరమైన వ్యక్తి ముఖ్యమంత్రి జగన్ అని, ఆయనది అరాచక పాలన అని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. ఆదివారం శృంగవృక్షం గ్రామంలో పెద్దింట్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన ప్రభుత్వంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పెద్దింట్లమ్మ అమ్మవారి జాతరలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో ప్రజలంతా టిడిపిని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారనేది మొన్న జరిగిన పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో నిరూపితమైందన్నారు. చట్టసభల్లో, స్థానిక సంస్థల్లో ఎటువంటి ప్రాతినిధ్యంలేని బీసీ కులాలకు టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రాధాన్యం కల్పించేలా కృషి చేస్తానన్నారు. ఆయన వెంట ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, మాజీ ఎంఎల్‌ఎ వేటుకూరు వెంకట శివరామరాజు ఉన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం : పివిఎల్

ప్రజాశక్తి - కాళ్ల

పొదుపు సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం వైఎస్ఆర్ ఆసరా ద్వారా రుణమాఫీ చేస్తోందని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. పెదఅమిరం వైసిపి కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 31వ తేదీన ఉండి మండలంలో, ఏప్రిల్ ఒకటో తేదీన పాలకోడేరు మండలం, ఏప్రిల్ 2న ఆకివీడు మండలం,4న కాళ్ల మండలంలో వైఎస్ఆర్ ఆసరా సాయం అందించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్ఆర్ ఆసరా మూడో విడత కింద 5,232 మంది లబ్ధిదారులకు రూ.62.63 కోట్లు సాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాళ్ల ఎంపిపి శిరీష విశ్వనాథరాజు, పాలకోడేరు ఎంపిపి భూపతి రాజు చంటిరాజు, ఆకివీడు ఎంపిపి కటారి జయలక్ష్మి కేశవ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ సన్నిధిలో ఎంపీ మోపిదేవి

మొగల్తూరు:ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ అమ్మవారిని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, ఆలయ కార్యనిర్వహణ అధికారి దెందుకూరు రామకృష్ణంరాజు, ఛైర్మన్ కొల్లాటి రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి శేష వస్త్రం, జ్ఞాపిక, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాపూజీ, బంధన పూర్ణచంద్రరావు, కొల్లాటి బాబూరావు, పాల రాంబాబు పాల్గొన్నారు.

మొగల్తూరు:ముత్యాలపల్లి గ్రామంలోని బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వహణ అధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, ఛైర్మన్ కొల్లాటి రామారావు పర్యవేక్షణలో యాత్రికులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ప్రసాద వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

మానవత భీమవరం శాఖ ఎన్నిక

భీమవరం రూరల్ :మానవత భీమవరం నూతన శాఖ ఆదివారం ఘనంగా ఎన్నికైంది. ఆర్యవైశ్య వర్తక సంఘ భవనం వద్ద జరిగిన కార్యక్రమానికి మానవత విస్తరణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ సాగిరాజు జానకీరామరాజు అధ్యక్షత వహించగా, జిల్లా అధ్యక్షులు రామిశెట్టి గంగాధర్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతన కమిటీ సభ్యులకు సంస్థ విధులను, నిర్వహించే కార్యక్రమాలను, బాధ్యతలను తెలియజేశారు. సంస్థకు ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ సుంకర ముసలయ్య అందించిన మార్చురీ ఫ్రీజర్‌ను జిల్లా డిఎంహెచ్ఒ మహేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మానవత సెంట్రల్ కమిటీ సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు, రాష్ట్ర కన్వీనర్ కోటేశ్వరరావు, వంకాయల రామారావు, వసుధ ఫౌండేషన్ కార్యదర్శి మంతెన కృష్ణంరాజు పాల్గొన్నారు.

విఆర్ఒల సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శిగా సురేష్

ప్రజాశక్తి - పాలకోడేరు

గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం భీమవరం డివిజన్ ప్రధాన కార్యదర్శిగా పంపన సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన మోగల్లు విఆర్ఓగా ప్రస్తుతం పని చేస్తున్నారు. భీమవరం ఎన్‌జిఒ భవనంలో నిర్వహించిన డివిజన్ సమావేశంలో సంఘం అధ్యక్షుడు కెనడీ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. డివిజన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన సురేష్‌ను తహశీల్దార్ షేక్ హుస్సేన్, ఆర్ఐ నాగభూషణంరావుతో పాటు మండల రెవెన్యూ అధికారులు, విఆర్ఒలు అభినందించారు.

సిపిఐ సీనియర్ నేత విశ్వనాథం మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

సిపిఐ సీనియర్ నాయకుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి, రాష్ట్ర సమితి సభ్యుడు, అరట్లకట్ట గ్రామ మాజీ ఉపసర్పంచి దొమ్మేటి విశ్వనాథం (70) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు. ఉన్నారు. ఆయన మృతికి సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, రాష్ట్ర సమితి సభ్యులు నెక్కంటి సుబ్బారావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు నెక్కంటి క్రాంతికుమార్, జిల్లా సమితి సభ్యులు ఆరేటి మృత్యుంజయరావు సంతాపం తెలిపారు.

సరస్వతి మృతి బాధాకరం

ఐద్వా సీనియర్ నేత అల్లూరి మన్మోహిని

ప్రజాశక్తి - తణుకు రూరల్

పెరవలి మండలం అజ్జరం గ్రామానికి చెందిన ఆదర్శ స్త్రీ మూర్తి పెన్మెత్స సరస్వతి (93) మృతి బాధాకరమని ఐద్వా సీనియర్ నేత అల్లూరి మన్మోహిని (అమ్మాజీ) ఒక ప్రకటనలో సంతపం తెలిపారు. ఆ గ్రామ పంచాయతీ అధ్యక్షులు, పెరవలి సమితి అధ్యక్షులుగా పని చేసిన పెన్మెత్స నరసింహరాజు (అజ్జరం దత్తుడు) భార్య సరస్వతి అని పేర్కొన్నారు. సరస్వతి వయోభారంతో శనివారం మృతి చెందారని తెలిపారు. సరస్వతి సోదరుడు పెనుమంట్ర మండలం పొలమూరుకు చెందిన కలిదిండి భీమరాజు ప్రముఖ న్యాయవాదిగా, కమ్యూనిస్టు పార్టీ నేతగా పని చేశారని గుర్తు చేశారు. సరస్వతి ఉమ్మడి కుటుంబంలో ఆదర్శ భావాలతో ముందుకు సాగారని కొనియాడారు. ఆమె కుటుంబ సభ్యులకు మన్మోహిని ప్రగాఢ సానుభూతి తెలిపారు

సరస్వతి కుటుంబ సభ్యులను సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ ఆదివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దుబాయ్‌లో జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - ఆచంట

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దళిత క్రైస్తవులకు ఎస్‌సి హోదాకల్పించే విధంగా అసెంబ్లీలో తీర్మానం ప్రవేశ పెట్టినందుకు కృతజ్ఞతగా యుఎఇలోని క్రిస్టియన్ దళిత సంఘాల ఆధ్వర్యంలో దుబాయ్‌లో సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారని వైసిపి యూత్ నాయకుడు తరపట్ల మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా జగన్‌కు అభినందనలు తెలిపి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న దళితుల చిరకాల కోరిక ముఖ్యమంత్రి జగన్ తీర్చనున్నారని కొనియాడారు. రాబోయే ఎన్నికల్లో ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచంట నియోజకవర్గానికి చెందిన వైసిపి శ్రేణులు పాలపర్తి నీలిమ, కాగిత కుమార్, గోసంగి లక్ష్మి, కొల్లే రవికుమార్, నక్క ఎలిజబెత్ పాల్గొన్నారు.

కళాకారులకు చేయూతనివ్వాలి

ప్రజాశక్తి - గణపవరం

కళాకారులకు చేయూతనివ్వడం అందరి బాధ్యతని గణపవరం పద్మినీపురం కళా పీఠం అధ్యక్షులు రుద్రరాజు వెంకట సూర్యనారాయణ రాజు, అన్నపూర్ణమ్మ దంపతులు తెలిపారు. ఆదివారం స్థానిక కన్యకాపరమేశ్వరి భవనంలో జరిగిన కాళ్లకూరు సుబ్బారావు 13వ వార్షికోత్సవ పురస్కారాల్లో భాగంగా కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీమవరం వాస్తవ్యులు చుక్కాన సత్యనారాయణ రాజు, పాలకొల్లు మండలానికి చెందిన రచయిత, నటుడు గంటా కళ్యాణ్ నాయుడును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కన్యకా పరమేశ్వరి వర్తక సంఘ ఉపాధ్యక్షులు వంకాయల రామారావు, ప్రముఖ కవి తెన్నేటి, ఎం.ప్రకాశం పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 5, 10వ తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 5న నిర్వహించిన 23వ ప్రతిభా పాటవ పరీక్షల్లో విజేతలకు బహుమతి ప్రదానోత్సవం శనివారం రాత్రి కవిటంలోని మేడపాటి పరుసరామిరెడ్డి జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎల్‌సి షేక్ సాబ్జీ హాజరై విద్యార్థులకు బహుమతులు అందజేసి మాట్లాడారు. విద్యార్థులు పట్టుదలతో చదవాలన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గుంటూరి పెద్దిరాజు, ఎంపిపి సబ్బితి సుమంగళి, సర్పంచి చుట్టుగుల్ల పూర్ణిమ, యుటిఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శి దాసరి క్షేమమూర్తి, కేతా నాగరాజు పాల్గొన్నారు.

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పాలకోడేరు

మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ వాలంటీర్ల పోస్టులకు ఈ నెల 29వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ నూకల మురళీ గంగాధరరావు తెలిపారు. గొల్లలకోడేరు పోస్టు ఒసి మహిళకు కేటాయించారు. కుముదవల్లిలోని మూడు, పాలకోడేరులో 2 పోస్టు, పెన్నాడలో 2, శృంగవృక్షంలో 3 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.

ఆచంట :మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలో ఖాళీగా ఉన్న 31వ విడత వాలంటీర్ పోస్టులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపిడిఒ విఎస్‌విఎల్.జగన్నాధరావు విలేకరులు తెలిపారు. మండలంలో 11 వాలంటీర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వాటిలో ఆచంట-1లో 4, ఆచంట-3లో 1, అయోధ్యలంకలో 3, కొడమంచిలిలో 1, కరుగోరుమిల్లిలో 1, పెనుమంచిలిలో ఒక పోస్టు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆయా పోస్టులకు ఈనెల 29వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఘనంగా అచ్చెన్నాయుడు పుట్టినరోజు

భీమవరం రూరల్ : కేక్ కట్ చేస్తున్న తోట సీతారామలక్ష్మి

ప్రజాశక్తి - ఉండి

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, టెక్కలి నియోజకవర్గ శాసనసభ్యులు కింజరపు అచ్చెన్నాయుడు 53వ పుట్టినరోజు వేడుకలు పార్టీ మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు ఆధ్వర్యంలో టిడిపి కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, మాజీ ఎంఎల్‌ఎ వేటుకూరి వెంకట శివరామరాజు పాల్గొని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేకుకట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఐదు పర్యాయాలు ఎంఎల్‌ఎగా అచ్చెన్నాయుడు పనిచేశారన్నారు. పార్టీ పట్ల ఆయన నిబద్ధతతో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు పెన్మెత్స కృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, గ్రామ అధ్యక్షులు కాగిత బుజ్జి, సీనియర్ నాయకులు జుత్తిగ శ్రీనివాస్ పాల్గొన్నారు.

భీమవరం రూరల్ :టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, ఎంఎల్‌ఎ అచ్చెన్నాయుడు పుట్టినరోజు వేడుకలు స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నేతల సమక్షంలో నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ అచ్చెన్నాయుడు మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలన్నారు. రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి మాట్లాడుతూ ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నించినందుకే ఆయనపై అక్రమ కేసులు బనాయించి జైలులో ఉంచిన జగన్ ప్రభుత్వానికి అచ్చెన్నాయుడు రిటర్న్ గిఫ్ట్ ఇవ్వటం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మామిడిశెట్టి ప్రసాద్, టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు రేవు వెంకన్న, కౌరు పృథ్వీశంకర్ పాల్గొన్నారు.

గణపవరం : టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజారపు అచ్చెన్నాయుడు పుట్టినరోజు వేడుకలు గణపవరంలో టిడిపి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వెలంపేటలో కేక్‌కట్ చేసి స్థానికులకు పంపిణీ చేశారు. అనంతరం పిహెచ్‌సిలో రోగులకు, ఎస్‌సి బాలికల హాస్టల్ విద్యార్థులకు పండ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు రామకృష్ణంరాజు, గణపవరం అధ్యక్షులు సురేంద్ర కుమార్ రాజు, నాయకులు పల్లి వెంకటేశ్వరరావు, షేక్ బషీరుద్దీన్, ఎ.సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం

ప్రజాశక్తి - పెనుమంట్ర

200 దేశాల్లో తమ విద్యార్థులు వివిధ స్థాయిలో ఉన్నారని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ గుబ్బల తమ్మయ్య అన్నారు. ఆదివారం బ్రాహ్మణచెరువులోని సాయినాథ కళ్యాణ మండపంలో జరిగిన ఎంజెపి గౌతమి ఇఎంయుపి స్కూల్ ప్రథమ వార్షికోత్సవం స్కూల్ కరస్పాండెంట్ ఎం.జగదీష్ బాబు ఆధ్వర్యాన జరిగింది. ఈ సందర్భంగా గుబ్బల తమ్మయ్య మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ చాలా అవసరమన్నారు. క్రమశిక్షణ ఉన్నప్పుడే విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థితికి ఎదగడంతోపాటు విద్యాసంస్థలకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు వస్తాయన్నారు. ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసురెడ్డి) మాట్లాడుతూ విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఇటువంటి సమయాల్లో నిర్వహిస్తే తల్లిదండ్రులకు వారి ప్రావీణ్యత తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ వివేక బాలభారతి ఎడ్యుకేషన్ ఛైర్మన్ తేతలి సుబ్బ రాయలరెడ్డి, తాడిపర్తి జ్యోతి, విద్యాసంస్థల ఛైర్మన్ పులమూటి కేశవమూర్తి, తణుకు సత్యసాయి హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కెవివిఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ గుబ్బల తమ్మయ్య

గుండెపోటుతో రామేశ్వరస్వామి ఆలయ గుమస్తా మృతి

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట రామేశ్వరస్వామి ఆలయంలో గుమస్తాగా పనిచేస్తున్న మేకా గోపాలకృష్ణ (52) ఆదివారం ఉదయం ఇంటి వద్ద గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. గోపాలకృష్ణ మృతి పట్ల ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆర్‌బివిఎస్ రామచంద్రకుమార్ ఛైర్మన్, నెక్కంటి రామలింగేశ్వరరావు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్, సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వరరావు, కుక్కల కిరణ్, అప్పారావు, దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు ఆయన భౌతికాయాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

పేరంటాలమ్మ సన్నిధిలో నేతలు

ప్రజాశక్తి - ఉండి

వెలువర్రు గ్రామ దేవత వీర పేరంటాలమ్మ అమ్మవారి 70వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం అమ్మవారిని టిటిడి బోర్డు మాజీ సభ్యులు గోకరాజు రామరాజు, జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగరాజు దర్శించుకున్నారు. వారికి ఆలయ కమిటీ ఛైర్మన్ మంతెన రంగరాజు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోకరాజు రామరాజు, జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ ఆలయాన్ని గ్రామస్తులు, దాతల సహకారంతో ఆలయ కమిటీ ఛైర్మన్ మంతెన రంగరాజు ఎంతో అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఆలయ ప్రాంగణంలో కళ్యాణ మండపం, గదుల నిర్మాణం వంటివి చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జానపద సృజనాత్మక అకాడమీ కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, నాయకులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మకు కాసు బంగారం విరాళం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరానికి చెందిన మోటేపల్లి శ్రీనివాసు, రామలక్ష్మి దంపతులు ఆదివారం మావుళ్లమ్మ అమ్మవారి స్వర్ణాభరణం నిమిత్తం కాసు బంగారం విరాళంగా ఆలయ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ముత్యాల వెంకట రామారావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం మండలం, గొల్లవానితిప్ప, లోసరి గూట్లపాడు గ్రామ కాపురస్తులు గడ్డం శాంతకుమారి, తండ్రి: మైలా ఏసుపాదం, భర్త: గడ్డం ఏసుపాదం, అనే నేను తెలియ చేయునది ఏమనగా.., ది. 14-03-2023వ తేదిన పాస్ పోర్టు పని నిమిత్తం గొల్లవానితిప్ప నుండి భీమవరం వెళ్తుండగా మార్గం మధ్యలో నా **ఒరిజనల్ పాస్‌పోర్టు నెం. K7849413 పడిపోయినది.** చుట్టుప్రక్కల ఎంత వెదికినను దొరకలేదు. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది చిరునామాకు అందజేయగలరు.

గడ్డం శాంతకుమారి
తండ్రి: మైలా ఏసుపాదం,
భర్త: గడ్డం ఏసుపాదం, గొల్లవానితిప్ప,
లోసరి గూట్లపాడు, భీమవరం మండలం,
ప॥గో॥జిల్లా. సెల్ నెం: 99083 91128

In The Court Of The 1st Additional Junior Civil Judge :: Tanuku
O.S.No. 557/2022

Between:
Bandaru Dhana Raju ...*Plaintiff*
AND
Perisetti Dhana Lakshmi and another ...*Defendant*

To: Defendant:
1) Perisetti Dhana Lakshmi, W/o. Bhaskara Rao, Hindu, Female, Age 53 Years, R/o. D.No. 11-158, Near Veerabhadra Swamy Temple, Velpuru, Tanuku Mandal, W.G.Dist.
2) Perisetti Bhanu Durga Prasad, S/o. Bhaskara Rao, Hindu, Male, Age 30 Years, R/o. D.No. 11-158, Near Veerabhadra Swamy Temple, Velpuru, Tanuku Mandal, W.G.Dist.

Please take notice that the above suit filed by the plaintiff ageinst you stands posted to 18-04-2023 for your appearance in person or through yout counsel **at 10:30 A.M. on 18-04-2023 before the above Hon'bel Court.** Failing which the matter shall be decided by the Hon'ble Court in your absence as per law.

//By Order of The Hon'ble Court//
B.VENKAT, Advocate,
Tanuku. Cell: 70131 23186

తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి.నెం. 45/2022
ఓ.ఎస్.నెం. 49/2021

మధ్య:
గాది నరసింహారావు, S/o. రామారావు, మేల్, వయస్సు 39, వ్యాపారం, R/o. డో.నెం.9-12-12/2, ఎగ్గినవారి వీధి, సవిత్రుపేట, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా.
...*డిక్రీ హోల్డర్ /డి. హెచ్. ఆర్*

VS

కాకులపాటి వరప్రసాద్, S/o. జోసఫ్, మేల్, ఎంప్లాయి, R/o. డో.నెం. 7-12-14, పాతూరు, 12వ వార్డు, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా.
...*జడ్జిమెంటు డెట్టార్ /జె.డి. ఆర్*

డి. హెచ్. ఆర్. తరపు దాఖలు చేసిన పత్రికా ప్రకటన

పై తెల్పిన ఇ.పి.నెం. 45/2022లో జె.డి.ఆర్. అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా Order 21 Rule 54 నోటీసు పలుమార్లు పంపినా జె.డి.ఆర్. ఉద్దేశ్యపూర్వకంగా నోటీసులు తీసుకోనందున సబ్‌సిస్ట్యూట్ సర్వీసు ద్వారా అనగా ఈ పత్రికా ప్రకటన ద్వారా పై కోర్టు వారు తెలియజేయమని ఉత్తర్వులు జారీ చేసిన మీదట మీరు స్వయంగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట **ది.13-04-2023వ తేదీ ఉదయం గం॥ 10:30 ని॥లకు హాజరు అయ్యి సదరు పై తెల్పిన ఇ.పి.నెం. 45/2022లో సమాధానం తెల్పవలెను.** లేని ఎడల పై కోర్టు వారు మీ పై పరోక్షముగా తీర్మానం చేయుదురు అని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఇట్లు.., శిరిగినీడి విజయకృష్ణ
అడ్వకట్ & నోటరీ,
అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్,
తాడేపల్లిగూడెం.
తాడేపల్లిగూడెం,
26-3-2023.